సాక్షి
నిజామాబాద్

బుధవారం, 29, నవంబర్, 2023



నేను పక్కా లోకల్..

నేను లోకల్ అని, ప్రత్యర్థులంతా నాన్‌లోకల్ అని ఎవరు కావాలో ప్రజలు ఆలోచించి ఓటేయాలని స్పీకర్ పోచారం అన్నారు.

- 2లో ▸



వైన్‌షాప్‌లలో నోస్టాక్

వరుసగా రెండురోజులు వైన్‌షాపులు మూసి ఉంచుతుండడంతో మందుబాబులు మద్యం దుకాణాల ఎదుట బారులు తీరారు.

- 2లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.3 /21.3

ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. రాత్రివేళ చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రచార కార్యక్రమాలపై నిషేధం

సుభాష్‌నగర్ : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి ప్రచారం నిషేధమని, ఎన్నికలు ముగిసే వరకు జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి రాజీవ్ గాంధీ హనుమంతు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 48 గంటల సైలెంట్ పీరియడ్ దృష్ట్యా జిల్లాయేతర వ్యక్తులు జిల్లాలో ఉండొద్దన్నారు. ఒపీనియన్ పోల్, ఎగ్జిట్ పోల్స్ నిషేధమన్నారు. నవంబర్ 28 సాయంత్రం ఐదు గంటల నుంచి ఎన్నికలయ్యేంత వరకు జిల్లాలో వైన్‌షాపులు బంద్ చేయించామన్నారు.

30న వేతనంతో కూడిన సెలవు

సుభాష్‌నగర్ : అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఈనెల 30న పోలింగ్ ఉన్నందున జరగనున్న సందర్భంగా ప్రభుత్వం గురువారం వేతనంతో కూడిన సెలవు ప్రకటించిందని జిల్లా ఎన్నికల అధికారి రాజీవ్ గాంధీ హనుమంతు మంగళవారం ప్రకటనలో తెలిపారు. పోలింగ్ కేంద్రాలుగా, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లుగా ఉన్న విద్యాసంస్థలు, ప్రభుత్వ సంస్థలకు 29న కూడా సెలవిచ్చారన్నారు.

1,245 స్కూళ్లలో పోలింగ్

నిజామాబాద్ అర్బన్ : జిల్లావ్యాప్తంగా గురువారం సాధారణ ఎన్నికల దృష్ట్యా 1245 పాఠశాలల్లో పోలింగ్ జరుగనుంది. జిల్లాలో మొత్తం 1,720 ఉన్నాయి. అందులో 1,245 స్కూళ్లను నేడు పోలింగ్ అధికారులకు అప్పగించనున్నారు. పాఠశాలల్లో లేని ఫర్నిచర్‌ను పోలింగ్ సిబ్బంది అమర్చుకోనున్నారు. నేడు పోలింగ్ అధికారులు పోలింగ్ కేంద్రాలకు చేరుకుంటారు. రాత్రి అక్కడే బసచేసి ఉదయం పోలింగ్ నిర్వహణకు సిద్ధమవుతారు.

పూర్తయిన మూడోవిడత ర్యాండమైజేషన్



సుభాష్‌నగర్ : ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా మంగళవారం పోలింగ్ సిబ్బంది మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ ఎన్నికల సాధారణ పరిశీలకుల సమక్షంలో పూర్తి చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు నేతృత్వంలో కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ హాల్‌లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ థర్డ్ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ప్రతి నియోజకవర్గం పరిధిలో పోలింగ్ నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఐదు పోలింగ్ కేంద్రాల చొప్పున మహిళా బృందాలు, ఒక దివ్యాంగుల బృందం, ఒక యువతతో కూడిన పోలింగ్ బృందాన్ని ఎంపిక చేసినట్లు వివరించారు. ఈసందర్భంగా మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజేషన్ ప్రక్రియ కూడా పూర్తి చేశారు. అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, సీపీవో బాబూరావు, ఎన్ఐసీ అధికారి రవికుమార్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

అన్నా బాగేనా..

- ఫోన్లు, వాట్సాప్ కాల్స్ ద్వారా మాట్లాడుతున్న కీలక నాయకులు
- అభ్యర్థుల గెలుపుకోసం తిప్పలు
- ఓట్లు ఎటేద్దామంటూ చర్చించుకుంటున్న బంధువులు, స్నేహితులు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ప్రచార పర్వం ముగిసింది. పోలింగ్‌కు కొన్ని గంటలు మాత్రమే మిగిలి ఉన్న నేపథ్యంలో అభ్యర్థులకు సన్నిహితంగా ఉంటున్న నియోజకవర్గ స్థాయి నాయకులు, ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు సైతం తమవంతుగా విపరీతంగా కష్టపడుతున్నారు. కొందరు నాయకులైతే తమ పార్టీ అభ్యర్థిని గెలిపించుకునేందుకు తమ స్థాయిని తగ్గించుకుని మరీ ఓటర్లను, ఓటర్లను ప్రభావితం చేయగలిగిన కొందరు వ్యక్తులను బతిమిలాడుతున్నారు. చివరకు కాళ్లు మొక్కేందుకు సైతం వెనుకాడడం లేదు. అదేవిధంగా సదరు నాయకులు గత వారం రోజులుగా తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు ఎడతెరిపి లేకుండా ఫోన్లు, వాట్సాప్ కాల్స్ చేస్తూ తమ అభ్యర్థులకు ఓట్లు వేయించాలని అభ్యర్థిస్తుండడం గమనార్హం. గ్రామాల్లో, వార్డుల్లో, పట్టణాల్లో డివిజన్లలో ఓటర్లను ప్రభావితం చేయగలిగిన వారికి, వివిధ కాలనీల సమూహాల్లోని వారికి, కాలనీల సంక్షేమ సంఘాల నాయకులకు, మహిళా సంఘాల నాయకులకు, యువజన సంఘాల బాధ్యులకు సైతం వరుసగా ఫోన్లు చేస్తూ ఓట్లను వేయించాలని కోరుతున్నారు.

సదరు నాయకులు తమ కంటే వయస్సులో చాలా చిన్నవాళ్లను సైతం ప్రాధేయపడుతుండడం విశేషం. అన్నా బాగేనా.. తమ్మీ అంతా మంచేనా అంటూ ఫోన్లలో పలకరిస్తుండడంతో పాటు అవసరమైతే వాళ్లను కలిసి ఓట్ల విషయమై అభ్యర్థనలు చేస్తున్నారు. తటస్థ ఓటర్లతో పాటు కొంత ఊగిసలాటలో ఉన్నవారిని సైతం ఆకట్టుకునేందుకు వారిని బతిమిలాడుతున్నారు. ఇలా కొందరు నాయకులు గత వారం రోజులుగా రాత్రింబవళ్లు ఆహారం సైతం మరచి తమ అభ్యర్థి గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారు. ఎలాంటి భేషజాలకు పోకుండా కృషి చేస్తున్నారు. స్మార్ట్ ఫోన్లు ఉండడంతో వాట్సాప్‌ను సైతం ఓటర్లను మొబిలైజ్ చేసుకుని ఆకట్టుకునేందుకు గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రచారం బంద్ కావడంతో పాటు పోలింగ్‌కు మరికొన్ని గంటలే ఉండడంతో అభ్యర్థులు, కీలకమైన నియోజకవర్గాల నాయకులు ప్రతి నిమిషాన్ని ఉపయోగించుకుంటూ భారీగా శ్రమిస్తున్నారు. ప్రత్యర్థి పార్టీలో ఉన్నప్పటికీ ఓట్లు మాత్రం తమ అభ్యర్థికి వేసేవిధంగా కన్విన్స్ చేస్తున్న ఘటనలు కోకొల్లలు ఉంటున్నాయి.

పీఆర్‌వోల బృందాల ద్వారా..

ప్రజల నాడి, ఓటర్ల మనోగతం ఎలా ఉందో తెలుసుకునేందుకు అభ్యర్థులు ప్రత్యేకంగా పీఆర్‌వోల బృందాలను ఏర్పాటు చేసుకున్నారు. ఈ పీఆర్‌వోలు వివిధ వర్గాల ప్రజలను కలుస్తూ తమకు అవసరమైన వివరాలను రాబట్టుకుంటున్నారు. తద్వారా తమ అభ్యర్థి ఏవిధంగా ముందుకెళ్లాలనే విషయమై వివరాలందిస్తున్నారు.

అభ్యర్థులపై జోరుగా చర్చలు..

ప్రస్తుత స్మార్ట్ యుగంలో ప్రతి విషయాన్ని షేర్ చేసుకోవడం సర్వసాధారణం అయింది. ఈ నేపథ్యంలో సాధారణ ఓటర్లు ఓటును ఏ పార్టీకి వేయాలనే విషయమై ఇతర జిల్లాల్లోని తమ స్నేహితులు, బంధువులకు సైతం మరీ ఫోన్లు చేసి చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఒకే నియోజకవర్గంలో ఉన్న ఓటర్లు మాత్రం ఏ అభ్యర్థికి బాగుంటుందనే విషయమై ఎప్పటికప్పుడు చర్చించుకుంటున్నారు. జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లో అయితే ఒక అభ్యర్థిని ఓడించాలంటే మరో ఇద్దరు ప్రత్యర్థుల్లో ఎవరికి ఓటేస్తే బాగుంటుందనే విషయమై అత్యధికంగా చర్చ జరుగుతుండడం విశేషం.



మాధవనగర్ వద్ద రైస్‌మిల్‌పై లేచిపోయిన రేకులు



జానకంపేట్ వద్ద కారుపై పడిన చెట్టు

జిల్లాలో వర్షబీభత్సం

- ఈదురుగాలులు.. రాళ్లవాన
- విరిగిపడిన చెట్లు, కరెంటు స్తంభాలు
- నిలిచిన విద్యుత్ సరఫరా



కంజరలో కురిసిన వడగండ్లు

ఎడపల్లి (బోధన్) : జిల్లావ్యాప్తంగా రాళ్లవాన వర్షం బీభత్సం సృష్టించింది. మంగళవారం సాయంత్రం వాతావరణంలో మార్పులొచ్చి భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో జిల్లాలో చాలా ప్రాంతాల్లో చెట్లు, కరెంటుస్తంభాలు నేలకూలాయి. విద్యుత్‌సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నగరంలోని శివాజీనగర్‌లో, బస్వాగార్డెన్ వద్ద స్తంభాలు విరిగిపడతా విద్యుత్ సరఫరా నిలిచింది. ఎడపల్లి మండలంలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కురిసిన భారీవర్షానికి అలీసాగర్ ఉద్యానవనం వద్ద పార్క్ చేసిన కార్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఉద్యానవనంలో వందేళ్ల చరిత్ర ఉన్న భారీచెట్టు నేలకూలింది.

ప్రలోభాల పర్వం షురూ..!

సుభాష్‌నగర్ : ప్రచార పర్వం ముగియడంతో ప్రలోభాల పర్వానికి కొందరు అభ్యర్థులు తెరలేపారు. పోలింగ్‌కు ఒక రోజే మిగిలి ఉండటంతో ఓటర్లకు గాలం వేసేందుకు తాయిలాలు మొదలుపెట్టారు. ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు చివరి ప్రయత్నం చేస్తున్నారు. నగదు, మద్యం పంపిణీకి ఇప్పటికే ఏర్పాట్లు చేసుకున్నట్లు ప్రచారం సాగుతోంది. గ్రామాలు, డివిజన్లలో మద్యం, డబ్బు ప్రవాహం కొనసాగుతోంది. కులసంఘాలు, మహిళా సంఘాల ద్వారా నగదు పంపిణీ జరిగే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. 20రోజులుగా సాగిన అభ్యర్థుల ప్రచారం మంగళవారంతో ముగిసింది.

స్వేచ్ఛగా ఓటేయాలి

- జిల్లా ఎన్నికల అధికారి రాజీవ్ గాంధీ హనుమంతు
- పటిష్ట భద్రత : సీపీ కల్మేశ్వర్

సుభాష్‌నగర్ : అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా గురువారం జరగనున్న పోలింగ్‌లో ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు పిలుపునిచ్చారు. జిల్లా పరిధిలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సీపీ కల్మేశ్వర్‌తో సమావేశంలో మాట్లాడారు. ఓటరు కార్డు లేకపోయినా, 12 గుర్తింపుపొందిన కార్డుల్లో దేనితోనైనా ఓటు వేయవచ్చన్నారు. 30న ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ఉంటుందన్నారు. జిల్లాలో 833 ప్రాంతాల్లో 1,549 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 13,94,986 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఇప్పటిదాకా 2,248 మంది ఓట్ ఫ్రం హోం ద్వారా ఇంటినుంచే ఓటేశారన్నారు. జిల్లాలో 7,215 మంది సిబ్బంది, ఇతర జిల్లాల్లో విధులు నిర్వర్తిస్తున్న 648 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేశారన్నారు.

159 ఉల్లంఘన కేసులు

ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించినందుకు 159 కేసులు నమోదు చేశామని సీపీ కల్మేశ్వర్ తెలిపారు. అనుమతి లేకుండా ప్రచారం చేసినందుకు 37 కేసులు, నగదు, మద్యం పంపిణీ 29 కేసులు, విధుల్లో ఉన్న ఉద్యోగులను అడ్డుకున్నారని తొమ్మిది, ఇతరుల మనోభావాలను దెబ్బతీసేలా అనుచిత ప్రసంగాలు చేసినందుకు 2, మతపరమైన ప్రాంతాల్లో ప్రచారాలపై 3 కేసులు నమోదు చేశామన్నారు. 3000 పైచిలుకు మందితో అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత ఏర్పాటు చేస్తున్నామని, మహారాష్ట్ర పోలీసులతో పాటు 9 కంపెనీల కేంద్ర బలగాలు జిల్లాకు వచ్చాయన్నారు. 107 మొబైల్ పార్టీ బృందాలను ఏర్పాటు చేశామన్నారు.



ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న కలెక్టర్, సీపీ

పకడ్బందీ ఏర్పాట్లు

అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పకడ్బందీగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర, బాలికల పాలిటెక్నిక్ కళాశాలలతోపాటు సీఎస్ఐ కాలేజీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్, డిస్ట్రిబ్యూషన్, రిసీవింగ్ సెంటర్లను కలెక్టర్ మంగళవారం సీపీ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ మకరందుతో కలిసి పరిశీలించారు. పాలిటెక్నిక్‌లో అధికారులకు మార్పులు, చేర్పులను సూచించారు.

కాంగ్రెస్, బీజేపీది మొసలి కన్నీరు..

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నిజామాబాద్‌నాగారం: ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలు మొసలి కన్నీరు కారుస్తూ అమలుకు సాధ్యం కాని బాండ్ పేపర్లతో నిరుద్యోగ యువతను, ప్రజలను మోసం చేస్తున్నాయని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఎమ్మెల్సీ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 55 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ హయాంలో 6 గంటల కరెంట్ ఇస్తే కేవలం పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ 24 గంటల నిరంతర విద్యుత్తును అందిస్తోందన్నారు. గతంలో 68 లక్షల వరి ధాన్యం పండితే ఇప్పుడు 3.5 కోట్ల టన్నుల ధాన్యం పండుతోందన్నారు. బీజేపీ నేతత్వంలోని కేంద్ర ప్రభుత్వంలో 13.87 వేల ఖాళీలు ఉన్నాయని, గత పదేళ్లలో ఒక్క ఖాళీని కూడా కేంద్రం భర్తీ చేయలేదని ఆరోపించారు. కేంద్రంలో, బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఉద్యోగ నియామకాలు చేపట్టకుండా ఆ పార్టీల నాయకులు తెలంగాణలో నిరుద్యోగ సమావేశాలు ఏర్పాటు చేయడం హాస్యాస్పదమన్నారు. మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రేషన్ కార్డులను సరిదిద్ది కొత్త కార్డులను అందిస్తుందన్నారు. సౌభాగ్య లక్ష్మి పథకం కింద పేద మహిళలకు రూ. 3 వేల పింఛన్, బీడీ కార్మికులతో సహా అన్ని పింఛన్లను రూ. 5 వేలకు పెంచాలని సీఎం కేసీఆర్ సంకల్పించారని వివరించారు. కారు గుర్తుకు ఓటేసి అన్ని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. బోధన్ ఎమ్మెల్యే అభ్యర్థి షకీల్, ఇతర నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

క్లుప్తంగా

బీజేపీతోనే.. బీసీలకు రాజ్యాధికారం



సుభాష్‌నగర్: బీసీలకు రాజ్యాధికారం కేవలం బీజేపీతోనే సాధ్యమని, మోదీ ప్రభుత్వం బీసీలకు ప్రత్యేక ప్రాముఖ్యత ఇస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మాదాసు స్వామి యాదవ్ మంగళవారం తెలిపారు. ప్రధాని మోదీ మంత్రివర్గంలో 27 మంది బీసీలు కేంద్రమంత్రులు ఉన్నారని, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో 40 మంది బీసీలకు టికెట్లు ఇచ్చినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు బీసీలపై చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు. బీసీలు కాంగ్రెస్‌కు ఓటేస్తే ఒక వర్గం వారే ఆధిపత్యం చెలాయిస్తారని, బీసీల ఓట్లతో బీఆర్‌ఎస్ దొరల ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని విమర్శించారు. బీసీలు బీజేపీకి ఓటేస్తే బీసీ ప్రభుత్వం ఏర్పాటవుతుందని, ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని ప్రజలను కోరారు.

పోలింగ్ శాతం పెంచేలా..



మోర్తాడ్: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ శాతం పెంచేలా ఎన్నికల కమిషన్ చర్యలు చేపట్టింది. పోలింగ్ గురువారం ఉండడంతో ఓటర్లు అధిక సంఖ్యలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా తగు చర్యలు చేపట్టింది. వీటి కోసం ఉద్యోగులకు ఎన్నికల కమిషన్ దిశానిర్దేశం చేసింది. గతంలో 70 శాతం నుంచి 75 శాతం పోలింగ్ జరుగగా ఈసారి 90 శాతం పోలింగ్ జరిగేలా ఎన్నికల కమిషన్ దృష్టి సారించింది. ఇప్పటికే జిల్లాలో లక్ష్యానికి అనుగుణంగా పోలింగ్ స్లిప్పులను పంపిణీ చేశారు. స్లిప్పులను పంపిణీ చేసే సమయంలోనే ఓటు హక్కు ప్రాధాన్యతను అందరు తెలుసుకునేలా ఉద్యోగులు వివరించారు.

ఓటు నిబంధన

- ఓటు హక్కు వినియోగానికి ఈసీ ఏర్పాట్లు



ఖలీల్‌వాడి: డెమోక్రసీలో ఓటుకే ప్రాధాన్యత ఉంటుంది. ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఎన్నికల సంఘం పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టింది. ఓటు సాధారణంగా అందరికీ ఒకేలా ఉంటుంది. కానీ అదే ఓటును కొన్ని సమయాల్లో వేరే పేరుతో పిలుస్తారు.

జాబితాలో పేరు లేకుంటే..

ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకోవాలంటే ఓటరు జాబితాలో తప్పనిసరిగా పేరు ఉండాల్సిందే. ఒకవేళ పేరు లేకుంటే ఓటు హక్కు వినియోగానికి అనర్హుడు. ఓటరు తన ఓటు ఏ పోలింగ్ బూత్‌లో ఉందనేది అందుబాటులో ఉండే బీఎల్‌వోల ద్వారా తెలుసుకోవాలి. బీఎల్‌వోలు ఇచ్చిన ఓటరు స్లిప్ వెనుకాల ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే పోలింగ్ కేంద్రం సమాచారం లభిస్తుంది.

టెండర్ ఓటుకు అవకాశం

ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వెళ్లిన వ్యక్తి అప్పటికే వేరే వ్యక్తి తన ఓటును వినియోగించుకున్నాడని తెలిస్తే సదరు ఓటరు ఎన్నికల నిబంధనల మేరకు 49–ఏ ప్రకారం టెండర్ ఓటేసే అవకాశం ఉంటుంది. ఈ ఓటు వేసే వ్యక్తి ఈవీఎంల ద్వారా వేయడానికి వీలులేదు. బ్యాలెట్ రూపంలో ఓటు వేసే అవకాశం ఉంది. దీనికి సంబంధించిన ప్రక్రియ పీఓ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఏపీఓ, అభ్యర్థుల పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో ఓటరు జాబితాను చెక్ చేసుకుంటారు. ఇప్పుడున్న పరిస్థితిలో దొంగ ఓట్లు వేసే అవకాశం లేదు. జిల్లాలో ఎక్కడా టెండర్ ఓటు నమోదు కాదని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

వీరికే అనుమతి..

పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, వారి ఏజెంట్‌లకు అవకాశం ఉంటుంది. ఓటరుతో పాటు పసిపిల్లలకు అవకాశం ఉంది. పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్స్, సెక్టోరల్ అధికారులు, ఈసీఐ ద్వారా అనుమతి పొందిన విలేకరులు, ఈసీఐ ద్వారా అనుమతి పొందిన ఇతరులు పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు అవకాశం ఉంటుంది.

వీవీప్యాట్‌తో..

ఈవీఎంల ద్వారా ఓటు వేస్తే ఓటు పడుతుందా లేదా అనే సందేహాలు వ్యక్తవుతున్నాయి. అందుకే ఎన్నికల సంఘం వీవీప్యాట్ యంత్రాల ద్వారా సమస్యకు పరిష్కారం చూపింది. వీవీప్యాట్ తెరపై ఓటరు వేసిన గుర్తు కనబడుతుంది. దానితో ఓటరు తాను వేసిన ఓటును నిర్ధారించుకుంటారు. వేసిన ఓటు వీవీప్యాట్‌పై కనబడితే పారదర్శకంగా ఓటు వేసినట్లు లెక్క. లేకుంటే పీఓకు ఫిర్యాదు చేయాలి.

నిబంధనలు పాటించాల్సిందే..

ఓటుహక్కును వినియోగించుకునేవారు తప్పనిసరిగా ఎన్నికల నిబంధనలు పాటించాలి. పోలింగ్ కేంద్రాల వద్ద అభ్యర్థుల గుర్తులు, కండువాలు, వస్త్రాలను ధరించవద్దు. సెల్‌ఫోన్లను తమ వెంట తీసుకెళ్లకూడదు. ఓటరు పోలింగ్ కేంద్రాలకు వెళ్లేటప్పుడు భద్రత సిబ్బందికి సహకరించాలి. ఓటు హక్కు వినియోగానికి పోల్ స్లిప్ ప్రమాణికం కాదు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు 16 ధ్రువపత్రాలలో ఏదైనా ఒకటి తీసుకెళ్తే ఓటు వేసేందుకు అవకాశం ఉంది.

ఓటింగ్ ప్రక్రియ ఇలా..

ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్ అధికారి(పీఓ), అదనపు ప్రిసైడింగ్ అధికారి(ఏపీఓ), ఇద్దరు ఇతర పోలింగ్ అధికారులు(ఓపీఓ) విధులు నిర్వహిస్తారు. ఓటర్లు వీరికి సహకరించి ఓటుహక్కు వినియోగించుకోవాల్సి ఉంటుంది. మొదట ఏపీఓ ఓటు వేయడానికి వచ్చిన వ్యక్తి పేరును పోలింగ్ కేంద్రంలోని ఓటరు జాబితాలో ఉంటే ఓటరు గుర్తింపు, క్రమసంఖ్య, పేరు గట్టిగా చదివి వినిపిస్తారు. అభ్యర్థులకు సంబంధించిన ఏజెంట్లు సరేనని ఒప్పుకుంటే ఓటరు ఎడమ చేతి చూపుడు వేలును చెక్ చేస్తారు. ఓపీఓ–1 మూడు బాధ్యతలు (ఓటరు సిరా చుక్క వేయడం, 17ఏ రిజిస్టార్‌లో పేరు నమోదు, ఓటరు స్లిప్ రాయటం)నిర్వహిస్తారు. దీని తర్వాత ఏపీఓ–2 దగ్గరకు వెళితే పోల్ స్లిప్ తీసుకొని కంట్రోల్ యూనిట్(సీయూ)లో బటన్ నొక్కి ఓటేసే అవకాశం కల్పిస్తారు. ఓటరు ఓటు వేసే ప్రదేశానికి వెళ్లి ఓటు వేసి బయటకు రావాల్సి ఉంటుంది. ఇలా ఓటింగ్ ప్రక్రియ జరుగుతుంది. ఓటరుకు ఏమైనా అనుమానాలు సందేహాలు ఉంటే ప్రిసైడింగ్ అధికారి(పీఓ)కు ఫిర్యాదు చేయవచ్చు. ఈ విధానాన్ని పీఓ పర్యవేక్షించి రెండు గంటకొకసారి నమోదు అయిన పోలింగ్ వివరాలను సెక్టోరియల్ ఆఫీసర్‌కు సమాచారం అందిస్తారు.

మాట ఇస్తే తప్పడు.. ఈ సీనన్న



బాన్సువాడలో మాట్లాడుతున్న పోచారం



రుద్రూర్‌లో..

- నేను లోకల్.. ప్రత్యర్థులు నాన్‌లోకల్
- అభివృద్ధి చేశా.. ఆశీర్వదించండి
- బాన్సువాడ రోడ్ షోలో బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ: నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని మాట ఇస్తే తప్పడు.. ఈ సీనన్న అని, నేను లోకల్.. ప్రత్యర్థులు నాన్ లోకల్ ఎవరు కావాలో ప్రజలు ఆలోచించి ఓటేయాలని బీఆర్‌ఎస్ బాన్సువాడ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బాన్సువాడ పట్టణంలో ప్రధాన వీధుల గుండా మంగళవారం రోడ్ షో నిర్వహించారు. బాన్సువాడను రూ.650 కోట్లతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. రూ.40 కోట్లతో రహదారి విస్తరణ, రూ.100 కోట్లతో ప్రతీ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పట్టణానికి 2400 డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. తాడ్కోల్ శివారులో వెయ్యి డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టించి ఇచ్చినట్లు తెలిపారు. పట్టణంలో ఉన్న ప్రతి పేద వాడికి సొంత ఇల్లు ఉండాలన్నదే తన లక్ష్యమని అన్నారు. అనంతరం బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఎల్లారెడ్డిలో ప్రజలకు మంచి చేయని వ్యక్తి నేడు బాన్సువాడలో ఓట్లడుగుతున్నాడని, అలాంటి వ్యక్తులను ప్రజలు నమొద్దని సూచించారు. ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే కత్తెర గంగాధర్, మున్సిపల్ చైర్మన్ గంగాధర్, నాయకులు అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, ఎజాస్, గురువినయ్, శ్రీధర్, పాత బాలకృష్ణ, మోహన్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి..

రుద్రూర్: గ్రామాల్లో జరిగిన అభివృద్ధి చూసి తనకు ఓటు వేయాలని బాన్సువాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రజలను కోరారు. మండలంలోని కొందాపూర్, రుద్రూర్ మండల కేంద్రాల్లో రోడ్ షో, ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను, బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఎంపీపీ సుజాత నాగేందర్, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు పత్తి లక్ష్మణ్, బాల్‌రాజ్, పార్టీ గ్రామ అధ్యక్షుడు తోట్ల గంగారాం, విండో మాజీ చైర్మన్ పత్తి రాము, విండో చైర్మన్ సంజీవరెడ్డి, జడ్పీటీసీ నరోజి గంగారాం, సర్పంచ్ కొర్వ భాగ్య భూషణ్, ఎంపీటీసీ లక్ష్మి, కొందాపూర్ రాజయ్య, రాములు పాల్గొన్నారు.

వైన్‌షాపుల్లో నోస్టాక్

- మద్యం దుకాణాల వద్ద సందడి
- రెండురోజుల బంద్ నేపథ్యంలో..
- జిల్లాలో 102 వైన్స్‌లు, 20 బార్లు
- 28 సాయంత్రం నుంచి 30 వరకు క్లోజ్

ఖలీల్‌వాడి : శాసనసభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని వైన్స్ షాపుల వద్ద మద్యం ప్రియులు బారులు తీరారు. పోలింగ్, కౌంటింగ్ ఉన్న దృష్ట్యా రెండురోజుల పాటు మద్యంషాపులు మూసివేస్తారనే సమాచారంతో మద్యంప్రియులు వైన్‌షాపుల ఎదుట క్యూకట్టారు. దీంతో మంగళవారం మధ్యాహ్నానికే మద్యంషాపులు ఖాళీ అయ్యాయి. దీంతో బార్‌వైపు మద్యంప్రియులు పరుగులు తీశారు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు వైన్స్‌లను ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేసి సీల్ వేశారు. మంగళవారం సాయంత్రం నుంచి ఈనెల 30 వరకు వైన్స్‌షాపులు మూసి ఉంచుతారని ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి తెలిపారు. ఎక్కడైనా అక్రమంగా మద్యం నిల్వ చేసి ఉంచితే ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. 30న ఎన్నికలు పూర్తయ్యాక కలెక్టర్ అనుమతిస్తే రెండుగంటలపాటు వైన్స్‌లను తెరిచే అవకాశాలు ఉంటాయని ఎక్సైజ్ సూపరిండెంట్ మల్లారెడ్డి తెలిపారు.

ఈనెల 30న ముగియనున్న గడువు

జిల్లాలో 102 వైన్స్‌లు ఉండగా వీటి లైసెన్స్ గడువు నవంబర్ 30న ముగియనుంది. వీటికి ఆగస్టులో లక్కీ డ్రాలు నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికలు దృష్ట్యా వైన్స్‌లలో స్టాక్ మొత్తం ఖాళీ అయింది. నవంబర్ 30న వైన్స్‌లు గడువు ముగియడంతో డిసెంబర్ 1న కొత్త వైన్స్‌లకు అనుమతి వస్తుంది. కాని డిసెంబర్ 4 తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో లక్కీడ్రాలో కొత్త వైన్స్‌లు దక్కించుకున్న వారు వేచిచూడాల్సి ఉంటుంది.



వైన్ షాప్‌కు సీల్ వేస్తున్న అధికారులు, సిబ్బంది

ఆరువేల కోట్లతో బాల్కొండ అభివృద్ధి

- మళ్లీ ఆశీర్వదించండి.. మీ సేవకు అంకితమవుతా
- జనవరిలోనే కొత్త పింఛన్లు, గృహలక్ష్మి ఇళ్లు
- రూ.20కోట్లతో లింబాద్రి గుట్టను అభివృద్ధి చేస్తా
- హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతలకు స్టీల్ పైప్‌లైన్ వేయిస్తా
- విలేకరుల సమావేశంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



మట్లాడుతున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్: బాల్కొండ నియోజకవర్గానికి గత తొమ్మిదిన్నరేళ్లలో రూ.6వేల కోట్లతో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అందించామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. వేల్పూర్ మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కళ్లముందున్న అభివృద్ధిని చూసి తనను మళ్లీ ఆశీర్వదించాలని, ఐదేళ్లపాటు ప్రజా సేవకు అంకితమవుతానన్నారు. అన్ని కుల సంఘాలకు భవనాలు, గుడులకు, మసీదులకు, చర్చీలకు నిధులు ఇచ్చామని గుర్తు చేశారు.

ఇవన్ని ఇష్టపడి చేసినట్లు చెప్పా రు. ఇంకా మిగిలిని కొంత మందికి రేషన్‌కార్డులు, గృహలక్ష్మి పథకం ద్వారా ఇళ్లు నిర్మించుకునేందుకు ఎన్నికలు కాగానే జనవరిలో ఏర్పాట్లు చేస్తామన్నారు. కేసీఆర్ మళ్లీ సీఎం కాగానే సంక్షేమ పథకాలు, పింఛన్లు రెట్టింపవుతాయన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స ఖర్చులను రూ.15 లక్షల వరకు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. రూ.400 లకే గ్యాస్ సిలిండర్ ఇస్తామన్నారు. తాను మళ్లీ గెలవగానే ఐదేళ్లలో నింబాచల లక్ష్మీనర్సింహస్వామి గుడిని రూ.20 కోట్లతో బ్రహ్మాండంగా అభివృద్ధి చేస్తానని, చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి లిఫ్ట్‌కు ఉన్న సిమెంటు పైప్‌లైన్‌ను మార్చి స్టీలు పైపులైన్ వేయిస్తానని చెప్పా రు. వేల్పూర్‌లో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయిస్తామని, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో అద్భుతమైన పర్యాటక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తానని, బాల్కొండ ప్రజలు కోరుకుంటే బాల్కొండను మున్సిపాలిటీగా మారుస్తానని మాట హామీ ఇస్తున్నాన్నారు. పింఛన్లు, కల్యాణలక్ష్మి, రైతుబంధు, రైతుబీమా వంటి ఎన్నో పథకాలు అన్ని పార్టీల వారికి అందాయన్నారు. తొమ్మిది సంవత్సరాలుగా మీ కోసం ఇష్టపడి చెమటోడ్చిన తనను మరోసారి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు.

వర్ష బీభత్సం



వీక్లీ బజార్‌లో..



శివాజీనగర్‌లో విరిగిన భారీ వృక్షం



బస్వాగార్డెన్ వద్ద తెగిపడిన వైర్లు



నిజామాబాద్‌లో మంగళవారం రాత్రి రాళ్లవర్షం కురిసింది. నగరంలోని వీక్లీబజార్, వినాయక్‌నగర్, హౌసింగ్ బోర్డు, గాంధీచౌక్, ఎల్లమ్మగుట్ట, ఆర్‌ఆర్ చౌరస్తా, పలు చోట్ల జోరు వర్షంతో కూడిన రాళ్ల వర్షం పడింది. విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగిపోయాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మోస్రా, జానకంపేట రహదారిపై భారీ వృక్షాలు విరిగిపోవడంతో ట్రాఫిక్ సమస్య నెలకొంది.

– సుభాష్‌నగర్/ నిజామాబాద్‌సిటీ/ సాక్షి ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



విరిగిన స్తంభం

'రెచ్చగొట్టే పోస్టింగ్‌లు వద్దు'

ఖలీల్‌వాడి: అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ ఈ నెల 30న ప్రచార మాధ్యమాల్లో ఎలాంటి రెచ్చగొట్టె పోస్టింగ్‌లను పెట్టవద్దని సీపీ కల్మేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఇతరులను రెచ్చగొట్టేలా పోస్టర్లను అతికించడం, ఫ్లెక్సీలు పెట్టడం, సోషల్ మీడియా, వాట్సాప్, టెలిగ్రామ్, ఇతర గ్రూప్‌లలో రెచ్చగొట్టేలా పోస్టులు చేస్తే ఎన్నికల నిబంధన మేరకు తగు చర్యలు తీసుకొని కేసు నమోదు చేస్తామని అన్నారు. ఎవరైనా ఎన్నికల నిబంధన ఉల్లంఘిస్తే పదేళ్ల పాటు జైలు శిక్షపడే అవకాశం ఉందన్నారు.

క్రైం కార్నర్

వాటర్ ట్యాంకర్‌ను ఢీకొని ఒకరి మృతి



ఇందల్వాయి: మండలంలోని చంద్రాయన్‌పల్లి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై మహేశ్ మంగళవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. చంద్రాయన్‌పల్లికి చెందిన రాజమల్లు తన భార్యతో కలిసి బైక్‌పై పొలం వద్దకు వెళ్తుండగా రహదారిపై ఎదురుగా ఉన్న వాటర్ ట్యాంకర్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ రాజమల్లుని స్థానికులు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. అతని భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి అన్న కొడుకు నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తాగినమైకంలో ఒకరి హత్య



బస్వంత్ (ఫైల్)

పెద్దకొడప్‌గల్: తాగిన మైకంలో స్నేహితుల మధ్య ఏర్పడిన వైరం ఒకరిని హత్యకు గురి చేసేలా చేసింది. ఎస్సై కోనారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మెట్టుమిది బస్వంత్(35), కారడి సాయిలుకు స్థానిక వైన్‌షాప్ వద్ద వీరి స్నేహం ఏర్పడింది. వీరు తరచూ మద్యం తాగే వారు. సాయిలు బస్వంత్‌ను మూడు రోజుల క్రితం తన ఇంటికి తీసుకెళ్లి మద్యం సేవించాడు. వీరి మధ్య చోటు చేసుకున్న గొడవ బస్వంత్‌ను హత్యకు గురిచేసేలా చేసింది. సాయిలు ఇంటి నుంచి దుర్వాసన వస్తున్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు పరిశీలించగా బస్వంత్ మృతదేహం బాత్‌రూం సంపులో గుర్తించారు. ఘటన స్థలిలోనే మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి నానమ్మ పాపమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కోనారెడ్డి పేర్కొన్నారు.

మద్యం పట్టివేత

భీమ్‌గల్: పట్టణ కేంద్రంలో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని ఎక్సైజ్ శాఖ, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ వేణుమాధవ్‌రావు మాట్లాడుతూ..పట్టణ కేంద్రంలో కారులో అక్రమంగా మద్యం తరలిస్తుండగా గుర్తించి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. కారును నడుపుతున్న ఓంకార్‌పై కేసు నమోదు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తనిఖీల్లో అధికారులు రవీందర్, ఫయాజ్, దత్తాద్రి, సిబ్బంది పాల్గొన్నారు.

రుద్రూర్‌లో..

రుద్రూర్: కోటగిరి మండలం ఎత్తొండ క్యాంపులో వాహనాలను తనిఖీ చేస్తుండగా 50 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సందీప్ మంగళవారం తెలిపారు. మద్యం తీసుకెళ్తున్న నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పోతంగల్ మండలం శేషాద్రి ఫారంలో 50 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడి చేసినట్లు చెప్పారు. నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.